క్లుప్తంగా

ఓటు హక్కు నమోదు తప్పనిసరి



ఓటరు జాబితా పరిశీలిస్తున్న తహసీల్దార్ అరుణ

వైరా: ఓటు హక్కు విలువైనదని, 18 ఏళ్లు నిండిన యువత తప్పనిసరిగా ఓటు హక్కు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ నారపోగు అరుణ అన్నారు. ఆదివారం వైరా మున్సిపాలిటీ పరిధిలో డోర్ టు డోర్ ఓటరు జాబితాను సిబ్బందిలో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక 20వ వార్డులో బీఎల్ఓలతో కలసి జాబితా పరిశీలించి మాట్లాడారు. కొత్త ఓటర్లు గరుడ యాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆమె వెంట ఏఎస్ఓ మీరాబీ, అంగన్‌వాడీ టీచర్ పద్మావతి ఉన్నారు.

లబ్ధిదారుడికి ఎల్వోసీ పంపిణీ

బోనకల్: మండలంలోని రావినూతల గ్రామంలో నిరుపేద గిరిజన కుటుంబానికి చెందిన బానోత్ రాజేష్ గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. గ్రామ సర్పంచ్ కొమ్మినేని ఉపేందర్ చొరవ తీసుకొని, జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ ద్వారా ఎంపీ నామా నాగేశ్వరరావుకు విషయాన్ని తెలిపారు. హైద్రాబాద్ నిమ్స్ హాస్పిటల్ నందు ఎస్టిమేషన్ కాపీ ద్వారా ఎంపీ నామా నాగేశ్వరావు సిఫార్సుతో రూ.2.50లక్షల ఎల్వోసీని బాధితునికి అందజేశారు. దీంతో బాధితుడు రాజేష్‌కు ఆపరేషన్ జరిగింది. ఆపరేషన్ జరగడంతో వారి కుటుంబ సభ్యులు ఎంపీ నామా, జెడ్పీచైర్మన్ లింగాల, సర్పంచ్ కొమ్మినేని లకు కృతజ్ఞతలు తెలియజేశారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

ఎర్రుపాలెం: మండలంలోని కండ్రిక గ్రామానికి చెందిన వేజెండ్ల ప్రభావతికి మంజూరైన రూ.54 వేల చెక్కును ఆమె కుమారుడ శ్రీనివాస్‌కు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి ఆదివారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. సీఎల్పీ నేత భట్టి విక్రమార్క కృషితో ఈ చెక్కు మంజూరైందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల ఉపాధ్యక్షుడు నరసింహారావు, నాయకులు వెంకట నరసయ్య, తల్లపురెడ్డి నాగిరెడ్డి, నాగబాబు, పిచ్చిరెడ్డి, బోస్‌బాబు పాల్గొన్నారు.

దేవాదాయ భూముల సర్వే



సర్వే నిర్వహిస్తున్న ఎండోమెంట్ అధికారులు

కారేపల్లి: దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో పర్సా అనంతరామయ్య ధర్మసంస్థ ఇల్లందు ఆధీనంలో ఉన్న సింగరేణి మండలం మాధారం, గోవింద్‌తండా గ్రామాల్లో దేవాదాయ భూముల సర్వే కార్యక్రమాన్ని ఎండోమెంట్ అధికారులు ఆదివారం చేపట్టారు. కొత్తగూడెం డివిజన్ దేవాదాయ ధర్మాదాయ పరిశీలకుడు పి.బెయిల్‌సింగ్ ఆధ్వర్యంలో సర్వేయర్ పసునూరి అనీల్ 100 ఎకరాల్లో సర్వే చేపట్టి కొలతల రాళ్లు లేని చోట్లు రాళ్లు (హద్దులు) పాతించారు. ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ కార్యనిర్వాహణాధికారి వేణుగోపాలాచార్యులు, మేనేజర్ ఎన్.శేషయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

వైరా: వైరా బోడేపూడి కళానిలయంలో ప్రతి నెలా మూడో ఆదివారం నిర్వహించే ఉచిత వైద్య శిబిరం అదివారం విజయవంతంగా ముగిసింది. ప్రముఖ వైద్యులు డాక్టర్ చీకటి భారవి, డాక్టర్ ప్లిలలమర్రి సుబ్బారావు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బోడేపూడి కళానిలయం కార్యదర్శి బొంతు రాంబాబు, తోట నాగేశ్వరరావు, యనమద్ది రామకృష్ణ, బొంతు సమత, గుడిమెట్ల రజిత, మోహన్ రావు, మాదినేని రజిని, అనుమోలు రామారావు, ప్రసాద్, సత్యనారాయణ, నారాయణరెడ్డి, నాగేశ్వరరావు, కోటిరెడ్డి, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం..

తల్లాడ: మండలంలోని మల్లవరం గ్రామంలో వితంతు మహిళ ఉడల ఆదిలక్ష్మీ గత కొంత కాలంగా నరాల వ్యాధితో బాధపడుతోంది. ఆమెకు వైద్య ఖర్చులు భారమవడంతో విషయం తెలుసుకున్న పోలీసులు రూ.40 వేలు సేకరించి ఆమెకు అందించారు.

గీత కార్మికుని కుటుంబానికి..

బోనకల్: మండలంలోని మృష్టికుంట్లకు చెందిన బందం నాగేశ్వరరావు ఇటీవల తాటిచెట్టుపై నుంచి పడి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న జాగృతి ట్రస్ట్ చైర్మన్ కేసగాని రాజశేఖర్ గౌడ్ మృతుడి కుటుంబానికి రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. కుటుంబానికి అండగా ఉంటానన్నారు. మృతుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రామాంజనేయులు, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు, బీఆర్ఎస్ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు నాగేశ్వరరావు, వెంకటరాజ్యం, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

సర్వర్‌తోనే సమస్య..

- సర్టిఫికెట్ల కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారులు
- మిగిలింది ఇంకా ఒక్కరోజే
- సర్వర్ బిజీతో నిలిచిపోయిన పత్రాలు
- కుల వృత్తులకు రూ.లక్ష ఆర్థిక సాయం



మీ సేవా కేంద్రం వద్ద వేచి ఉన్న దరఖాస్తు దారులు



తహసీల్దార్ కార్యాలయం వద్ద..

తల్లాడ: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ప్రభుత్వం బీసీ కుల వృత్తిదార్లకు రూ.లక్ష ఆర్థిక సాయం అందించేందుకు దరఖాస్తులు కోరుతోంది. రాష్ట్రంలోని 15 బీసీ కులాలకు ఈ అవకాశం కల్పించింది. ఈ సాయానికి ఈ నెల 6 నుంచి 20 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రకటించింది. దీంతో వృత్తిదారులు ఇందుకు కావాల్సిన సర్టిఫికెట్ల కోసం గత 12 రోజులుగా తల్లాడ మీసేవా, ఇంటర్‌నెట్ సెంటర్లలో బారులు తీరారు.

సర్వర్ బీజీ బీజీ..

ఒక్కసారే వేలమంది దరఖాస్తు చేసుకోవడంతో తహసీల్‌లో సర్వర్ బీజీ వస్తుంది. ఈ క్రమంలో కొంత జాప్యం జరగడంతో లబ్ధిదారుల్లో ఆందోళన మొదలైంది. కుల, ఆదాయ సర్టిఫికెట్ల కోసం ఆన్‌లైన్ చేసిన తర్వాత చెక్ లిస్ట్ తీసుకొని ఆర్ఐ చేత ఫాం రాయించి డిప్యూటీ తహసీల్దార్‌కి ఇవ్వాలి. డీటీ పరిశీలన అనంతరం వాటిని తహసీల్దార్ జారీ చేస్తారు.

ఇప్పటి వరకు 800 దరఖాస్తులు..

6వ తారీకు నుంచి శనివారం వరకు మండలంలో సుమారు 800 మంది లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నారు. 21 నుంచి వచ్చే నెల 4వరకు లబ్ధిదారుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఉంటుంది. ఆ తర్వాత అర్హులకు రూ.లక్ష సాయం అందిస్తారు.

కావాల్సిన సర్టిఫికెట్లు, అర్హతలు..

దీనికి 18 నుంచి 55 సంవత్సరాల లోపు వయస్సు ఉండాలి. బీసీ కుల వృత్తిదారులై ఉండాలి. వారి ఆదాయం 1,50,000 లోపు ఉండాలి. క్యాస్ట్, ఇన్‌కమ్, రేషన్‌కార్డ్, ఆధార్‌కార్డ్, బ్యాంక్ ఎకౌంట్, పాన్‌కార్డ్, పాస్‌ఫొటో, ఫ్యామిలీ సపోర్ట్ ఆధార్‌కార్డ్ జిరాక్స్ ప్రతులతో వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ చేయాలి. అనంతరం ఆ ఫాంను మండల పరిషత్ కార్యాలయంలో ఇవ్వాలి.

ప్రాధాన్యత ఉంటుంది..



బీసీ కులాలకు రూ.లక్ష ఆర్థిక సాయంతో కుల వృత్తిదారులకు ప్రాధాన్యత ఉంటుంది. వృత్తిని నమ్ముకొని జీవిస్తున్న వారికి ఈ సాయంతో వృత్తి పనిముట్లను కొనుగోలు చేసి ఆర్థికంగా ఎదగడానికి ఉపయోగపడుతుంది. ఈ నెల 20 వరకు గడువు ఉన్నది. 21 నుంచి 4 వరకు దరఖాస్తులను వెరిఫికేషన్, అనంతరం రూ.లక్ష సాయం మంజూరు ఉంటుంది.

– బి.రవీంద్రరెడ్డి, ఎంపీడీఓ

సర్వర్ డౌన్‌తో సమస్య..



బీసీ కులాల వారు సర్టిఫికెట్ల కోసం ఎక్కువ మంది దరఖాస్తు చేసుకోవడంతో సర్వర్ డౌన్ అయ్యింది. ఈ క్రమంలో ఆన్‌లైన్‌లో సరిఫికెట్ల జారీ ఆలస్యమవుతుంది. మండలంలో 1,200 మంది కులం సర్టిఫికెట్స్, 2,500 మంది ఆదాయం సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఎప్పటికప్పుడు దరఖాస్తులను పరిశీలించి అందరికి సర్టిఫికెట్లు ఇచ్చేందుకు చర్యలు చేపట్టాం.

– గంటా శ్రీలత, తహసీల్దార్, తల్లాడ

దరఖాస్తు చేసుకున్నా..



బీసీ కార్పొరేషన్ ద్వారా రూ.లక్ష ఆర్థిక సాయానికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం అన్ని సర్టిఫికెట్స్ పెట్టి ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకున్నా. అనంతరం వీటిని ఎంపీడీఓ కార్యాలయంలో అందించా. కుల వృత్తిని నమ్ముకొని మా కుటుంబం మొత్తం జీవిస్తున్నాం. ప్రభుత్వం రూ.లక్ష సాయం అందిస్తే ఆర్థికంగా నిలదొక్కుకుంటాం. మా లాంటి వాళ్లను ఆదుకుంటాం.

– ఈలప్రోలు వెంకటి, దరఖాస్తుదారుడు, తల్లాడ

మున్సిపాలిటీకి అవార్డు రావటం అభినందనీయం



మున్సిపల్ చైర్మన్ మహేష్, కమిషనర్ సుజాతలను అవార్డులతో సన్మానిస్తున్న ఎమ్మెల్యే సండ్ర

సత్తుపల్లి: సత్తుపల్లి మున్సిపాల్టీకి రాష్ట్ర స్థాయిలో టీఎస్‌బీపాస్ ఉత్తమ అవార్డు రావటం అభినందనీయమని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. ఆదివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, కమిషనర్ కె.సుజాత, పాలక వర్గ సభ్యులను సత్కరించి అభినందించారు. ఈ అవార్డు రావడానికి కృషి చేసిన అధికారులు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. నేడు అర్బన్‌పార్క్‌లో ఉదయం 6:30 గంటలకు నిర్వహించే మెగా హరిత హారంలో అందరు పాల్గొని మొక్కలు నాటాలన్నారు. దేశంలో అన్ని ఆవాసాలకు తాగునీరు అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమేనని స్పష్టం చేశారు. అనంతరం వేంసూరు మండలం దూళ్ల కొత్తూరు గ్రామానికి చెందిన పార్టీ కార్యకర్త కలపాల హరిబాబు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా కుటుంబ సభ్యులకు రూ.2 లక్షల బీమా చెక్కును అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ శ్రీనివాసరావు, ఏఈ సురేష్, ఏఓ స్వప్న, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వర రావు, నరుకుళ్ల శ్రీను, ఎస్‌కే చాంద్‌పాషా, దేవరపల్లి ప్రవీణ్, మధు, సత్యనారాయణ, నర్సింహారావు, శ్రీనివాసరావు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం



సత్తుపల్లిరూరల్: కాంగ్రెస్ పార్టీలో చేరిన వారితో డాక్టర్ మట్టా దయానంద్

మధిర/సత్తుపల్లిరూరల్: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమవుతుందని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క సతీమని మల్లు నందిని, కాంగ్రెస్ జిల్లా నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ అన్నారు. మధిరలోని ఇల్లూరు గ్రామంలో శనివారం రాత్రి బీఆర్ఎస్ నుంచి పలు కుటుంబాల వారు కాంగ్రెస్ పార్టీలో చేరారు. సొసైటీ డైరెక్టర్ పత్తేపురపు సంగయ్య ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ నుంచి ఎన్నారై సైదులు, గ్రామపంచాయతీ వార్డు సభ్యురాలు షేక్ ఖాసింబి, షేక్ హుస్సేన్, మస్తాన్, నాగు పఠాన్, జాన్ పఠాన్ సైదా తదితర కుటుంబాల వారు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి ఆమె పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అంతే కాకుండా సత్తుపల్లిలోని రాజీవ్‌నగర్‌లో ఆదివారం నాయకులు షరీఫ్, నాగరాజు ఆధ్వర్యంలో సుమారు 160 కుటుంబాలు డాక్టర్ మట్టా దయానంద్, డాక్టర్ రాగమయి సమక్షంలో పార్టీలో చేరారు. అంతకుముందు కాలనీలో కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమాలల్లో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు నవీన్ రెడ్డి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు బాలరాజు, బుచ్చిరామయ్య, మున్సిపల్ కౌన్సిలర్ ధనికుమార్, రవికుమార్, రామారావు, మదార్ సాహెబ్, సత్యనారాయణరెడ్డి, బాజీ, శ్రీనివాస్, రాజేందర్, డేవిడ్, సత్తుపల్లిలో.. ఆత్మకమిటీ మాజీ చైర్మన్ రామకృష్ణ, జాతీయ బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్, సొసైటీ ఉపాధ్యక్షుడు చెన్నారావు, ఫయాజ్, మాజీ ఎంపీపీ వెంకటేశ్వరరావు, ఎండీ కమల్‌పాషా, రఫీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం..

ఎర్రుపాలెం: మండలంలోని గుంటుపల్లి, గోపవరం గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆపార్టీ మండల కమిటీ అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో అందరికీ కరపత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తేనే ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో పార్టీని ప్రజలు ఆదరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బండారు నర్సింహారావు, అనుమోలు కృష్ణారావు, సామినేని హనుమంతరావు, శీలం శ్రీనివాసరెడ్డి, కోట కృష్ణయ్య, కోలా వెంకటేశ్వర రావు, మందడపు వెంకటేశ్వరరావు, యన్నం పిచ్చిరెడ్డి, పిల్లి బోస్, రావూరి నాగబాబు, కంచర్ల వెంకటనర్సయ్య, కోట ఆదాం, శీలం వెంకట్రామిరెడ్డి తదితరులు ఉన్నారు.

హాథ్ సే హాథ్ జోడో యాత్ర

బోనకల్: మండలంలోని పలు గ్రామాలలో ఆదివారం రాత్రి మల్లు భట్టి విక్రమార్క సతీమణి మల్లు నందిని హాథ్ సే హాథ్ జోడో యాత్ర నిర్వహించారు. ఈ యాత్రను ఉద్దేశించి ఆమె మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలకు తీవ్ర అన్యాయం జరిగిందని, త్వరలో రాజన్న రాజ్యం వస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దుర్గారావు, పీసీసీ సభ్యుడు కిషోర్, డీసీసీ కార్యదర్శి నాగేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు కోటి, సర్పంచ్ సుబ్బారావు, నాగేశ్వరరావు, ఉపసర్పంచ్ సత్యనారాయణరెడ్డి, ప్రేమ్‌కుమార్, ముస్తాఫా, షాజాహాన్ పాల్గొన్నారు.

రాయితీలను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న జె.శ్రీపాద్

సత్తుపల్లి: బ్రిటీష్ పెట్రోలియం, రిలయన్స్ పెట్రోలింగ్ సంయుక్తంగా జియో బీపీగా మారిందని ఈ సందర్భంగా అందించే రాయితీలను వాహన వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని తెలుగు రాష్ట్రాల ఇన్‌చార్జ్ జె.శ్రీపాద్ అన్నారు. ఆదివారం సత్తుపల్లిలోని జె.కన్వెన్షన్‌హాల్‌లో జరిగిన లారీ ఓనర్స్ అసోసియేషన్ సమావేశంలో మాట్లాడారు. ఆర్ఎస్‌పీ పథకంతో రెండు నెలల వరకు మార్కెట్ ధర కంటే డీజిల్ ప్రతి లీటర్‌కు రూపాయి తక్కువగా ఇస్తామని, ట్రాన్స్‌కనెక్ట్‌కార్డుతో నవంబర్ నెల వరకు నెలలో ఐదు వేల లీటర్ల కంటే ఎక్కువ వాడిన వారికి లీటర్‌పై రూ.2 తగ్గింపు పొందవచ్చని తెలిపారు. సమావేశంలో తెలుగు రాష్ట్రాల ఆపరేషన్ హెడ్ జితేందర్‌రెడ్డి, ట్రాన్స్‌కనెక్ట్‌కార్డు మేనేజర్ సీహెచ్ చందుబాబు, సేల్స్ మేనేజర్ అరవింద్, లారీ అసోసియేషన్ అధ్యక్షుడు కొండపల్లి రమేష్‌రెడ్డి, లారీ యజమానులు, వినియోగదారులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ ఎదుట కౌన్సిలర్ ఆందోళన

వైరా: విద్యుత్ సమస్యలపై 10వ వార్డు కౌన్సిలర్ కర్నాటి నందిని ఆదివారం వైరా మున్సిపాలిటీ ఎదుట ధర్నా చేశారు. పలుమార్లు అధికారులకు తెలియజేసిన పట్టించుకోవడం లేదన్నారు. మున్సిపల్ కమిషనర్ పఠాని వెంకటేశ్వర్లు స్వయంగా లైట్లు వేయిస్తానని చెప్పినా లైట్లు వేయించేవరకు వెళ్లేది లేదని అక్కడే కూర్చున్నారు.

పెద్దమ్మతల్లికి బోనమెత్తిన కారేపల్లి

కారేపల్లి: కారేపల్లి పెద్దమ్మతల్లి 6వ వార్షికోత్సవంలో భాగంగా.. ఆదివారం కారేపల్లి గ్రామస్తులు పెద్దమ్మతల్లికి ఘనంగా బోనాలను సమర్పించారు. కారేపల్లిలోని పలు సెంటర్ల నుంచి మహిళలు ఆలయానికి చేరుకొని బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా కారేపల్లికి చెందిన శివసత్తులు డప్పుదరువుల నడుమ ప్రదర్శించిన నృత్యాలు తన్మయత్వాన్ని కలిగించాయి. కార్యక్రమాలను ఆలయ నిర్వాహణ కమిటీ చైర్మన్ మండెపూడి శ్రీనివాసరావు, ఆలయ కమిటీ సభ్యులు యర్రా నరసింహారావు గుప్తా, తురక రాంబాబు, పెద్దమ్మ సత్యం, తురక నారాయణ, చిరునోముల రామారావు, ఓరుగంటి రాజు, కంచి రమేష్ తదితరులు పర్యవేక్షించారు.

కాల్వలోకి దూసుకెళ్లిన ద్విచక్రవాహనం

ఏన్కూరు: గుర్తు తెలియని వాహనం ఢీకొని ద్విచక్ర వాహనం సాగర్ కాల్వలో పడటంతో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డ సంఘటన ఏన్కూరులో చోటుచేసుకుంది. వివరాల ప్రకారం మండలంలోని గార్లొడ్డు గ్రామానికి చెందిన ఓ యువకుడు ద్విచక్రవాహనం పై వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొడ్డటంతో పక్కనే ఉన్న సాగర్ కాల్వలో పడి పోయాడు. స్థానికులు యువకుడిని బయటకు తీసి 108, ద్వారా ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



అలనాటి గురువులతో పూర్వ విద్యార్థులు

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల 1993–96 బీఏ చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం కళాశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరినొకరు పలకరించుకొని ఆనాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం ఆలనాటి గురువులను సత్కరించారు. ఈ కార్యక్రమం జరిగేందుకు కృషి చేసిన పూర్వ విద్యార్థి శ్రీనివాసరావును తోటి స్నేహితులు అభినందించారు. ఈ కార్యక్రమంలో కొర్రపాటి సాలమన్‌రాజు, ఎన్.వెంకటేశ్వరరావు, ఎస్‌కే అఫ్జల్, రవి, భాస్కర్, సీహెచ్ వీరభద్రరావు, చలమాల విఠల్, లక్కినేని రమాకాంత్, శాంతిలక్ష్మి, జయసుధ, వైదేహి, సునీత, మాధవిలత, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

దేశానికే ఆదర్శంగా 'మిషన్ భగీరథ'

- ఘనంగా తాగునీటి దినోత్సవం
- పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు
- పలువురు సర్పంచ్‌లకు సత్కారం



భగీరథ నీటిని ఎంపీడీఓ రమాదేవికి అందజేస్తున్న ఎమ్మెల్యే రాములునాయక్, డీసీసీబీ చైర్మన్ కూరాకుల

కొణిజర్ల: సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన మిషన్ భగీరథ పథకం దేశానికే ఆదర్శంగా నిలిచిందని వైరా ఎమ్మెల్యే రాములు నాయక్, జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం కొణిజర్ల మండలం తనికెళ్ల ముక్రి హీల్స్ వద్ద గల మిషన్ భగీరథ ట్రీట్‌మెంట్ ప్లాంట్ వద్ద తాగునీటి దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా తనికెళ్ల సెంటర్ నుంచి మిషన్ భగీరథ ఓవర్ హెడ్ ట్యాంకు వరకు ర్యాలీ నిర్వహించారు. భగీరథ తాగునీటిని ఎమ్మెల్యే రాములునాయక్, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణంలు ప్రారంభించి తాగునీటి బిందెను ఎంపీడీఓ రమాదేవికి అందజేశారు. అధికారులు బోరు, ఫిల్టర్ నీటికి మధ్యగల తేడాను వివరించారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ మొగిలి స్నేహలత మాట్లాడుతూ.. చిన్నతనంలో నీటి కోసం దూరప్రాంతాలకు వెళ్లి తెచ్చుకోవడం తాను కూడా అనుభవించానన్నారు. మిషన్ భగీరథ ఈఈ పుష్పలత అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, బోనకల్ ఎంపీపీ కంకణాల సౌభాగ్యం, స్థానిక సర్పంచ్ చల్లా మోహనరావు, ఎంపీడీఓ రమాదేవి, తహసీల్దార్ సైదులు, మిషన్ భగీరథ డీఈలు మూర్తి, నవీన్, నరసింహారావు, ఏఈలు సతీష్, చైతన్య, శ్రీనివాస్, మురళి, మణిశంకర్ పలుగ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

పలువురు సర్పంచ్‌లకు సన్మానం..

కొణిజర్ల మండలం తనికెళ్ల ముక్రిహిల్స్ వద్ద జరిగిన కార్యక్రమంలో మంచిగా భగీరథ నీటిని వినియోగిస్తున్న కొణిజర్ల మండలంలో తనికెళ్ల, అమ్మపాలెం సర్పంచ్‌లతో పాటు వైరా, చింతకాని, మధిర, బోనకల్, ఎర్రుపాలెం మండలాలకు చెందిన ఇద్దరు సర్పంచ్‌ల చొప్పున వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్, జెడ్పీ చైర్మన్‌లింగాల కమల్‌రాజ్, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ స్నేహలత మొగిలి చేతుల మీదుగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు.

గ్రామాల్లో మంచినీటి దినోత్సవ వేడుకలు



ఎర్రుపాలెం: ర్యాలీ నిర్వహిస్తున్న విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల, అధికారులు, ప్రజాప్రతినిధులు

సత్తుపల్లిరూరల్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సత్తుపల్లి మండలంలోని అన్ని పంచాయతీలలో సర్పంచ్‌ల ఆధ్వర్యలో ఆదివారం మంచినీళ్ల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాటర్ ట్యాంక్‌ల వద్ద పూజలు నిర్వహించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంపు ఆపరేటర్లకు ఎంపీడీఓ సీహెచ్ సుభాషిణి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీధర్ మెమొంటోలు అందించి సత్కరించారు. కార్యక్రమాలలో సర్పంచ్‌లు రమాదేవి, సరస్వతి, వాసురెడ్డి, శ్రీనివాసరావు, కళావతి, రేణుక, వెంకటేశ్వరరావు, దామోదర్‌రెడ్డి, నాగయ్య, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎర్రుపాలెం: మిషన్ భగీరథ శాఖ ఆధ్వర్యంలో.. మంచినీళ్ల పండుగగ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, మధిర ఏఎంసీ మాజీ చైర్మన్ చావా రామకృష్ణ, ఎంపీపీ శిరీష, ఎంపీడీఓ శ్రీనివాసరావు, భగరథ డీఈ వెంకటేశ్వర రావు, ఏఈ శ్రీనివాస్, ఎంపీఈఓ శ్రీలక్ష్మి, సర్పంచ్ అప్పారావు, ఎంపీటీసీలు మస్తాన్‌వలీ, కిశోర్, కృష్ణారావు, రామకోటేశ్వరరావు, గ్రామ కార్యదర్శి నాగేశ్వరరావు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

పెనుబల్లి: మండలంలో మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ వద్ద సర్పంచ్ తావునాయక్ ఆధ్వర్యంలో మంచినీటి పండుగ వేడకలను నిర్వహించారు. ఈ సందర్భంగా వాటర్ ట్యాంక్ నుంచి గ్రామ పంచాయతీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ స్వరూపరాణి, ఎంపీడీఓ మహాలక్ష్మి, వియంబంజర్ సర్పంచ్ పంతులీ, ఎంపీటీసీ లక్ష్మీకాంతం, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కల్లూరురూరల్: మండలంలోని చెన్నూరు జెడ్పీఎస్ఎస్ స్కూల్‌లో గల భగీరథ ట్యాంక్ వద్ద సర్పంచ్ పాలెపు లక్ష్మి కాంతమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన మంచి నీటి దినోత్సవంలో మిషన్ భగీరథ ఏఈ రమేష్, ఎంపీటీసీ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి నగేష్‌రెడ్డి, గ్రామప్రజలు పాల్గొన్నారు.

తల్లాడ: మండలంలోని కనకగిరి గుట్టల సమీపంలో ఉన్న వాటర్ గ్రిడ్ వద్ద ఆదివారం జరిగిన ఆరు మండలాల తాగునీటి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లాడ ఎంపీపీ శ్రీనివాసరావు మాట్లాడారు. అనంతరం పులువురి సర్పంచ్‌లను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో వాటర్ గ్రిడ్ డీఈ వాణి, ఏఈలు, సూపర్‌వైజర్లు, ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

చింతకాని: మంచినీటి దినోత్సవంలో భాగంగా మండలంలోని మిషన్ భగీరథ ట్యాంకులను అలంకరించి గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామసర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ఉపసర్పంచ్‌లు, మిషన్ భగీరథ అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామ పంచాయతీ, ఐకేపీ సిబ్బంది, ఆశ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో విద్యార్థుల ప్రతిభ



రామకృష్ణ

మధిర: మండలంలోని మాటూరుపేట గ్రామానికి చెందిన సాదం రామకృష్ణ ఆదివారం విడుదలైన జేఈఈ అడ్వాన్స్‌డ్ ఎంట్రెన్స్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభను చాటాడు. ఓబీసీ విభాగంలో 47వ, ఓపెన్ కేటగిరిలో ఆలిండియా 2,734వ ర్యాంకులు సాధించాడు. విద్యాభ్యాసం మాటురుపేటలో 5 నుంచి 10వ తరగతి వరకు, ఇంటర్ హైద్రాబాద్‌లోని గౌలిదొడ్డి సీఓఈ కళాశాలలో పూర్తి చేశాడు. దీంతో ఇతనిని ఎంఈఓ వై.ప్రభాకర్‌తో పాటుగా మాటూరుపేట ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.



జె.బిందు

సత్తుపల్లిరూరల్: జేఈఈ అడ్వాన్స్ పరీక్ష ఫలితాల్లో సత్తుపల్లికి చెందిన జె.బిందు జాతీయ స్థాయిలో 174 ర్యాంక్ సాధించింది. సత్తుపల్లి మండలం గంగారం 15వ బెటాలియన్‌లో ఏఎస్సైగా పని చేస్తున్న జె.విజయ్‌కుమార్ కుమార్తె జె.బిందు ఉత్తమ ప్రతిభ చూపడంతో పలువురు అభినందనలు తెలిపారు. అదే విధంగా ఇంటర్‌లో 981 మార్కులు, టెన్త్‌క్లాస్ 10/10 సాధించి జేఈఈ మెయిన్స్‌లో 98 శాతం సాధించినందుకు తల్లిదండ్రులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

రాష్ట్రంలో బీజేపీదే అధికారం



వైరా: మాట్లాడుతున్న కేంద్ర మంత్రి బీఎల్ వర్మ

మధిర/వైరా: రాబోయే ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందని కేంద్రమంత్రి బీఎల్ వర్మ తెలిపారు. మధిర రెడ్డి గార్డెన్స్ కల్యాణ మండపంలో, వైరాలోని పరుచూరి గార్డెన్స్‌లో ఆదివారం జరిగిన మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మోర్చా కమిటీల సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తుందని ఆరోపించారు. కేంద్రమంత్రికి ఆత్కూరు క్రాస్ రోడ్డు వద్ద ఘన స్వాగతం పలికారు. అనంతరం కేంద్ర మంత్రిని బీజేపీ నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్ రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షులు సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి శ్యాంసుందర్ రాథోడ్, ఐటీ వింగ్ బాధ్యులు బీపీ నాయక్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ కోటేశ్వర రావు, మధిర అసెంబ్లీ కన్వీనర్ ఏలూరి నాగేశ్వర రావు, నాయకులు చిలువేరు సాంబశివరావు, పాపట్ల రమేష్, గుండా చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

హైకోర్టు ప్రధాన నాయమూర్తికి వినతి

మధిర: మధిర కోర్టు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరుతూ భువనగిరిలో ఆదివారం జరిగిన ఆలిండియా లాయర్స్ యూనియన్ తెలంగాణ రాష్ట్ర మూడో మహాసభల్లో పాల్గొన్న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఉజ్జల్ భుయాన్‌కు మధిర బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ వినతిపత్రం అందజేసిన వారిలో మధిర బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పుల్లారావు, రామరాజు న్యాయవాదులు సుంకుమోహన్ దాస్, జగన్మోహన్ రావు, జ్ఞానేశ్ ఉన్నారు.

ప్రయాణికులకు అవగాహన

కల్లూరు: టీఎస్ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్ ఆదేశానుసారం పల్లె వెలుగు బస్సులలో మహిళలు, సీనియర్ సిటిజన్స్ కోసం తెలంగాణ వ్యాప్తంగా ఆదివారం నుంచి ప్రవేశ పెట్టిన టీ9 60 పై ప్రయాణికులకు కల్లూరు విలేజ్‌బస్ ఆఫీసర్ కిన్నెర ఆనందరావు అవగాహన కల్పించారు. సత్తుపల్లి డిపో మేనేజర్ యు.రాజ్యలక్ష్మి ఆదేశానుసారం కల్లూరు బస్టాండ్‌లో ప్రయాణికులకు అవగాహన కల్పించి మొదటి టికెట్‌ను కల్లూరు నుంచి ఖమ్మంకు చంద్రుపట్ల గ్రామానికి చెందిన పి లీలావతి కండక్టర్ కేవీ లక్ష్మీ నుంచి కొనుగోలు చేసి బస్సులో (0268)లో ప్రయాణం చేశారు.

పేరుపల్లిలో కప్పతల్లి ఆట

కారేపల్లి: వానల కోసం పేరుపల్లి గ్రామస్తులు ఆదివారం కప్పతల్లి ఆట ఆడారు. రోకలిబండకు గుడ్డతో కప్పలను కట్టి, వాటికి వేప మండలను వేలాడదీసి గ్రామ వీధుల్లో ప్రదర్శనగా తిరిగారు. క్రమంలో గ్రామస్తులు వాటి పై నీళ్లతో అభిషేకం చేస్తు.. వానళ్లు కురవాలని భగవంతున్ని ప్రార్థించారు.

20న ఘంటసాల నాటక ప్రదర్శన

మధిర: ఖమ్మం భక్త రామదాసు కళాక్షేత్రంలో ఈ నెల 20న ఘంటసాల నాటక ప్రదర్శన ఉంటుందని మధిర రంగస్థల కళాకారుల సమాఖ్య అధ్యక్షుడు శ్రీకృష్ణ ప్రసాద్ తెలిపారు. ఈ నాటక ప్రదర్శనకు సంబంధించిన కరపత్రాలను ఆది వారం బంజారా కాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆవిష్కరించారు. నిర్వాహకుడు ఇంద్రకుమార్, శ్రీ సీతా రామాంజనేయ కళాపరిషత్ వ్యవస్థాపకుడు సుబ్బారావు, గురువులు తదితరులు పాల్గొన్నారు.